ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నేడు

శంషాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సుల్లో శనివారం స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు తెలిపారు. దోస్త్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయి ఖాళీగా ఉన్న మిగతా సీట్లను స్పాట్ అడ్మిషన్ ద్వారా భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పదో తరగతి, ఇంటర్మీడియట్ ఒరిజినల్ మార్కులు మెమోలు, టీసీ, బొనఫైడ్, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు జిరాక్ ప్రతులు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని రావాలని సూచించారు. వివరాలకు ఫోన్: 70327 13785లో సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



అత్తాపూర్: విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయిస్తున్నామని అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు ఎన్.సాయిప్రసాద్‌రావు అన్నారు. ఆయన నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరం, డెంటల్, బాలికలకు హిమోగ్లోబిన్ టెస్టులను నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు రజియాబేగం, సుజాత, రంగారెడ్డి, జ్యోతి, హేమలత, శ్రీనివాససాగర్, సురేష్, కమలమ్మ, కృష్ణవేణి, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన పెద్దగోల్కొండ పాఠశాల



ఉపాధ్యాయులను అభినందిస్తున్న డీఈఓ సుశీందర్‌రావు

శంషాబాద్ రూరల్: జిల్లా స్థాయి టీఎల్ఎమ్ మేళాలో మున్సిపాలిటీ పరిధిలోని పెద్దగోల్కొండ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు సత్తాచాటారు. జిల్లా స్థాయిలో మూడు ప్రథమ బహుమతులు సాధించారు. ఈ నెల 18న మహేశ్వరం మండలం తుక్కుగూడలో జరిగిన కార్యక్రమంలో వ్యాకరణ అంశాలు, ఆంగ్లంలో గ్రామర్ గార్డెన్ ఇంగ్లిష్ సామర్థ్యాలు సాధించే కృత్యం, పరిసరాల విజ్ఞానం, రవాణా వాహనాల కృత్యం అంశంలో అత్యుత్తమ ప్రతిభ చాటి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులను పలువురు అభినందించారు.

ప్రకృతిని కాపాడుకోవాలి



ప్రవచిస్తున్న చినజీయర్‌స్వామి

శంషాబాద్ రూరల్: విద్యార్థులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే ప్రకృతి, వనరులను కాపాడుతూ అభివృద్ధి చెందాలని శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి అన్నారు. మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న శ్రీరామనగరంలో శుక్రవారం నిర్వహించిన 'వికాస్ తరంగిణి-యువ వికాస్' కార్యక్రమంలో భాగంగా హాజరైన జంట నగరాల్లోని వివిధ కళాశాలల విద్యార్థులను ఉద్దేశించి జీయర్ స్వామి ప్రవచనం చేశారు. వ్యక్తిత్వ వికాసం.. జాతీయ భావాలను విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. శ్రీ అహోబిల జీయర్‌స్వామి, ఎంజీఐటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, కళాశాల యూహెచ్‌వీ సెల్ సభ్యుడు డాక్టర్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులు చక్కగా చదువుకున్నప్పుడే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుంటారని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్రమోడీ జన్మదిన ఉత్సవాల్లో భాగంగా మహిళా మోర్చా డివిజన్ అధ్యక్షురాలు ఉడుత లక్ష్మీ ఆధ్వర్యంలో పద్మశాలీపురం సాయి గ్రామర్ స్కూల్‌లో వికసిత్ భారత్, ఆత్మ నిర్భర్ భారత్, ఆపరేషన్ సింధూర్ అంశాలపై విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఉత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందదించారు పార్టీ డివిజన్ అధ్యక్షుడు గోదా పాండుయాదవ్, మాజీ డివిజన్ అధ్యక్షుడు అడికే జనార్ధన్, మహిళా మోర్చా నాయకురాళ్లు ధనలక్ష్మి, తిరుపతమ్మ, జయంతి, భాగ్య, అంజమ్మ, లక్ష్మి, ప్రభావతి, పూజ, అండాలు, బుచ్చిరెడ్డి, నర్సిరెడ్డి, మన్మోహన్‌రెడ్డి, బొల్లా రామకృష్ణ, రాజ్, ప్రభుదాస్, కుమార్, రామారావు, శేఖర్, అవినాష్, రమేష్‌రెడ్డి, స్కూల్ కరస్పాండెంట్ చారి తదితరులు పాల్గొన్నారు.



ధర్మోజీ కుంటలోకి వేసిన డ్రైనేజీ



ధర్మోజీ కుంటలోకి కొనసాగుతున్న డ్రైనేజీ పైపుల పనులు

ధర్మోజీ కుంట.. ఇకపై డ్రైనేజీ కుంట!

- కుంటలోకి డ్రైనేజీకి కలిపేసిన మున్సిపల్ అధికారులు
- అధికారుల తీరు తప్పుబడుతున్న పర్యావరణ ప్రియులు

శంషాబాద్: నీటి వనరుల పరిరక్షణను ప్రభుత్వం ఓ వైపు తీవ్రగా పరిగణిస్తుంటే.. మరోవైపు అధికారులు వాటి నిర్వహణ తీరుపై వ్యవహరిస్తున్న ముక్కు మూసుకునేలా చేస్తోంది.. ఇది పట్టణంలోని ధర్మోజీ కుంటే ఓ నిదర్శనంగా మారుతోంది. ఓ బస్తీ డ్రైనేజీ పరిష్కారం కోసమని చెబుతున్న అధికారులు దానిని నేరుగా తీసుకొచ్చి బస్తీ సమీపంలో ఉన్న కుంటలోకి అధికారికంగా వదిలేస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది.

ఇదేం నిర్వాకం...

పట్టణంలోని శంషాబాద్ రెవిన్యూ సర్వేనంబరు 73 లో ధర్మోజీ కుంట 10 ఎకరాల 12 గుంటల విస్తీర్ణంలో ఉంది. గతంలో సాగునీరందించిన ఈ కుంట ప్రస్తుతం ఎగువ ప్రాంతాల్లో వెలిసిన కట్టడాలతో నీటి వనరులు తగ్గిపోయి చెత్తకుప్పలకు ఆనవాలంగా మారింది. ఈ కుంటను పూర్తి స్థాయిలో తీర్చిదిద్దాలని పలుమార్లు స్థానికులు విన్నవించినా పెడచెవిన పెట్టిన అధికారులు ఇప్పుడు మాత్రం మురికినీటితో నిపేందుకు చకాచకా పనులు చేపడుతున్నారు. ఇప్పటికే కుంటలోకి పైపులు వేసి భారీ డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నారు ఎగువ ప్రాంతంలో చారీనగర్ కాలనీ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ఈ పనులు చేస్తున్నట్లు చెబుతున్న అధికారులు డ్రైనేజీ నీటిని కుంటలోకి కాకుండా సమీపంలో ఉన్న బస్తీల వరకు తీసుకొచ్చి అనుసంధానించే పనులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఇరిగేషన్ అభ్యంతరం చెప్పినా

కుంటలోకి డ్రైనేజీ నీటి వదిలేందుకు తాము ససేమిరా అన్నట్లు ఇరిగేషన్ అధికారులు సాక్షికి వివరించారు. మున్సిపల్ అధికారులే ఏకంగా ఈ పనులు చేపట్టడంపై పూర్తి స్థాయిలో అభ్యంతరం చెప్పకుండా మిన్నకుండిపోయినట్లు సమాచారం. ఇదిలా ఉంటే మున్సిపల్ అధికారులు మాత్రం ప్రస్తుతానికి వంపుగా ఉన్నందకు కుంటలోకి కలిపేస్తున్నామని భవిష్యత్తులో అక్కడి నుంచి మరింత ముందుకు తీసుకెళ్తామంటు సమాధానాన్ని దాటవేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఆగమేఘాల మీద చేపడుతున్న పనులు ఓ గరీబుకాలనీతో పాటు సమీపంలోనే ఉన్న కొన్ని బడావెంచర్లు, ఓ భారీ విల్లాల సమూహంతో పాటు ఓ కార్పోరేట్ పాఠశాలకు లాభం చేకూర్చే ప్రయత్నం కూడా లేకపోలేదనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. మొత్తం మీద ప్రభుత్వాధికారులే నిర్వీర్య దశలోఉన్న కుంటను తీర్చిదిద్దాల్సిన చోట దానిని డ్రైనేజీ నీటి కేంద్రంగా మార్చడం విడ్డూరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు ప్రభుత్వ వ్యవస్థలే మురుగుకుంటలను ఏర్పాటు చేస్తున్న తీరు సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

> **వద్దని చెప్పాం**
>
> ధర్మోజీ కుంటలోని మురుగు నీటి డ్రైనేజీ పైపులు వేయకూడదని చెప్పాం. మున్సిపల్ అధికారులు ప్రస్తుతానికి అందులోనే వేస్తామని పనులు చేపడుతున్నారు. పనులు కూడా కొనసాగుతున్నాయి. – మౌనిక, ఇరిగేషన్ ఏఈ
>
> **వంపులో ఉన్నందుకే...**
>
> చారీనగర్ కాలనీకి ధర్మోజీ కుంట వంపులో ఉన్నందున అందులోకి వేశాం. డ్రైనేజీ పనులు నిరంతర ప్రక్రియ భవిష్యత్తులో అక్కడి నుంచి డ్రైనేజీ పనులు ముందుకు కొనసాగించవచ్చు. ప్రస్తుతానికి అక్కడి వరకు వేయాల్సి వచ్చింది. – నరేష్, ఏఈ, శంషాబాద్ మున్సిపాలిటీ

సాంకేతికతను అందిపుచ్చుకుంటే నాణ్యమైన విద్య

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



ఎడ్యుబోట్ ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అవసరం అయితే సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట ప్రభుత్వ పాఠశాలలో ఏఐ ఆధారిత హ్యూమనాయిడ్ రోబోట్ ఎడ్యుబాట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రపంచం అంతా టెక్నాలజీ వెంట పరుగులు తీస్తుందని, దాన్ని ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవడం... సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇలాంటి సమాజిక ప్రయోగాలను అందరం కలిసి ప్రోత్సహిస్తే మంచి ఫలితాలను ఇస్తాయన్నారు. ప్రిడిక్ట్ ఎంఎల్ ఏఐ వ్యవస్థాపకురాలు ప్రభా సుందర్ మాట్లాడుతూ... ఇది టెక్నాలజీకే కాకుండా గ్రామీణ విద్యార్థులు సమాన విద్య పొందాలనే ఉద్దేశంతో పాటు గ్రామీణ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చటం, ఉపాధ్యాయులపై భారం తగ్గించాలనే ఉద్దేశంతో రోబోట్‌ను తయారు చేశామన్నారు. సాంకేతికతకు సామాజిక బాధ్యత, మానవత్వం కలిసినపుడు తరగతుల వాతావరణాన్ని, గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తును మార్చగల శక్తివంతమైన సాధనం అవుతుందన్నారు. ఈ సందర్భంగా ఎడ్యుబాట్ 6, 7, 8వ తరగతుల విద్యార్థులతో ఇంగ్లిష్, సైన్స్, లెక్కల పాఠాలలో ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించింది, పాఠ్యాంశాలతో పాటు ప్రస్తుత అంశాలపైనా వేసిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి అలరించింది. ఇలాంటి ప్రదర్శనలతో ఆప్యాయత, ఆశ, బరోసా కల్పిస్తుందన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్‌ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్‌లు జి.శివారెడ్డి, దుర్గేష్ యాదవ్, అమరేందర్‌రెడ్డి, నాయకులు యాదగిరి, హరిశంకర్, రాము, ఆర్. నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

శంషాబాద్ రూరల్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారనంగా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సురేష్‌రెడ్డి తెలిపారు. పెద్దషాపూర్ 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్, గండిగూడ 11 కేవీ అగ్రికల్చరల్ ఫీడర్ పరిధిలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, శంకరాపురం 11 కేవీ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. రోడ్డు విస్తరణ పనులు, కొత్తగా 11 కేవీ లైన్ ఎరక్షన్ పనుల కారణంగా ఘాంసిమియాగూడ, సరేన్ రిసార్ట్, ఎలైట్ హోమ్స్ ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేస్తామన్నారు. శంకరాపురం ఎస్ఎస్ ప్రాంతంలో కొత్తగా 33 కేవీ బ్రేకర్ ఏర్పాటు కారణంగా మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు కరెంటు ఉండదన్నారు. శంకరాపురం, ఐఎంటీ కళాశాల, తొండుపల్లి సుభాసన గ్రీన్ మరియు ఇందిరమ్మ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ వివరించారు.

పైప్‌లైన్ పనుల ప్రారంభం

శాస్త్రిపురం: సులేమాన్‌నగర్ డివిజన్‌లోని అలీబాబానగర్‌లో శుక్రవారం డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభమయ్యాయి. కొన్ని రోజులుగా బస్తీలో డ్రైనేజీ పైప్‌లైన్ లేనందు మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. దీంతో స్థానికుల ఫిర్యాదు మేరకు జీహెచ్ఎంసీ అధికారులు పైప్‌లైన్ పనులు ప్రారంభించారు.

వట్టినాగులపల్లి రోడ్డు పనులు పూర్తిచేయండి



రోడ్డు దుస్థితిని చూపుతున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: రెండు దశాబ్దాలుగా రోడ్డు పనులు పూర్తి కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పట్టించుకోవటం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లి నుంచి లింగంపల్లి వైపు ఉన్న రోడ్డును వంద అడుగుల వెడల్పుతో చేపట్టిన పనులు నిలిచిపోయి సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని బీఆర్ఎస్ పార్టీ నాయకులు బి.విష్ణు, శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సగం రోడ్డు పనులు పూర్తి కాగా రెండు సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పాలనలో పట్టించుకోవటం లేదన్నారు. అనేక మంది ఈ రోడ్డులో ప్రయాణిస్తూ గాయాల పాలు కావటం, మృతి చెందటం జరిగిందని అయినా ఎమ్మెల్యే ఇటువైపు వచ్చి చూసిన పాపాన పోలేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డు పనులను చేపట్టాలని, లేదంటే రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పి.కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు నాయకలు బి.సాయి, ఎ.కృష్ణ, శేఖర్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



హుడా కాలనీలో చెత్తను ఊడ్చిన సభ్యులు

మణికొండ: మన పరిసరాలు ఎంత పరిశుభ్రంగా ఉంటే మన ఆరోగ్యాలు అంత బాగుంటాయని, అందుకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని నవ సేవా సంకల్పట్రస్ట్ చైర్మన్ మణి, హుడాకాలనీ సీనియర్ సిటిజన్స్ క్లబ్ కార్యదర్శి టి.రమేష్‌బాబు అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని హుడాకాలనీ, మణికొండ క్వార్టర్స్, ఎంప్లాయిస్ కాలనీలలో శుక్రవారం పరిసరాల పరిశుభ్రత, రోడ్లపై చెత్త వేయవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మన కాలనీలు, మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచుకుని అత్యంత పరిశుభ్ర పట్టణాల జాబితాలో చేరాలన్నారు. గృహాల్లో నుంచి వచ్చే చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి మున్సిపాలిటీ వాహనాలకు అందివ్వాలన్నారు. ట్రస్ట్ సభ్యులు మహేష్, అజార్, భాస్కర్, సుధారామకృష్ణ, రాజేందర్, విష్ణు, సర్దార్ పటేల్ పార్క్ వాక్ మేట్స్ పద్మనాభాచార్యులు, సుగుణరాజు, ఇక్బాల్, వెంకటాచారి, పెంటారెడ్డి, శ్రీనివాస్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు చోట్ల ఉన్న చెత్తను ఊడ్చి మున్సిపాలిటీ వాహనాల్లో తరలించారు.

పరిశోధలనపై ప్రత్యేక దృష్టి సారించండి

రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ కులపతి జిష్ణుదేవ్ వర్మ



విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



పట్టాలు పొందిన విద్యార్థులతో గవర్నర్

రాజేంద్రనగర్: పశు వైద్యం అభివృద్ధికి, పశు సంపద సంక్షేమానికి విద్యార్థులు తోడ్పడాలని రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ కులపతి జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో వీపీ నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. పశు వైద్య వృత్తి చాలా భావోద్వేగాలతో కూడుకున్నదని... ఈ రంగాన్ని ఎంచుకున్న వారు పరిశోధనలపై ప్రత్యేక దృష్టి సారించాలని గవర్నర్ సూచించారు. అంతకుముందు గవర్నర్‌కు ఉప కులపతి జ్ఞాన ప్రకాశ్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం 2023–24వ విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించిన 524 మంది విద్యార్థులకు డిగ్రీలు, ప్రశంస పత్రాలను ప్రదానం చేశారు. వారిలో 16 మంది పీహెచ్‌పీ పట్టభద్రులు, ఆరుగురు మాస్టర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, 439 మంది బ్యాచ్‌లర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హస్బెండ్రీ, బీటెక్ డైరీ (టెక్నాలజీ), బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిషరీ సైన్స్ పట్టభద్రులు ఉన్నారు. ప్రతిభ కనబరిచిన 18 మంది విద్యార్థులకు 25 బంగారు పతకాలు, 2 ఉత్తమ ఉపాధ్యాయులకు బంగారు పతకాలను ప్రదానం చేశారు. స్నాతకోత్సవంలో నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ డాక్టర్ మీనిష్ షా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శరత్‌చంద్ర, డాక్టర్ ఉదయ్ కుమార్, డాక్టర్ కిషన్ కుమార్, డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ సతీష్ కుమార్, ప్రొఫెసర్ సత్యనారాయణ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

వసతుల కల్పనతోనే అభివృద్ధి: ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



చిత్రపురి కాలనీ బాక్స్ క్రికెట్ పార్క్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మణికొండ: మున్సిపాలిటీలలో నివసిస్తున్న ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధించినట్లని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం ఆయన ప్రత్యేకాధికారి జె. శ్రీనివాస్‌రావు, మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో రూ. 6.48 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మున్సిపాలిటీలలో సమృద్ధిగా నిధులు ఉండటంతో అనుకున్న అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, పార్కులు, ఆట స్థలాలు, రోడ్ల మధ్య డివైడర్‌లు ఏర్పాటైనప్పుడే ప్రజల జీవనానికి సౌకర్యంగా ఉంటుందన్నారు. అలాంటి పనులకు పెద్ద పీట వేసి నియోజకవర్గంలోని అన్ని మున్సిపాలిటీలలో అలాంటి పనులను చేపడుతున్నామన్నారు. నిధుల లభ్యతను బట్టి అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన నిరంతరం కొనసాగుతుందన్నారు. మున్సిపల్ డీఈలు శివసాయి, సంజయ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్‌ముదిరాజ్, మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం. జితేందర్, ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వంశీ, చిత్రపురి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్, మాజీ కౌన్సిలర్‌లు, కాంగ్రెస్, బీజేపీ నాయకులు, ఆయా కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధి ప్రబలకుండా చర్యలు



కుక్కలకు టీకాలు వేస్తున్న దృశ్యం

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా శుక్రవారం బ్లూ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో రేబిస్ వ్యాధి ప్రబలకుండా స్పెషల్ డ్రైవ్ చేపట్టి వీధి కుక్కలకు, పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో చేసిన వాక్సినేషన్ కార్యక్రమానికి కమిషనర్ శరత్‌చంద్ర హాజరయ్యారు. కార్పొరేషన్ పరిధిలో మరో నాలుగు వెహికల్స్‌లో పలు కాలనీలు తిరుగుతూ కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... కార్యక్రమాన్ని చేపట్టి వేదికలను రాబిస్ ఫ్రీ తెలంగాణగా తీర్చిదిద్దేందుకు కార్పొరేషన్‌లోని కుక్కలకు రాబిస్ వ్యాక్సినేషన్, వివిధ వ్యాధుల నివారణకు గాను టీకాలను ఇస్తున్నారన్నారు. రేబిస్ డిసిస్ వ్యాక్సిన్ వేయడానికి రూ. 1400 వరకు ఖర్చు అవుతుంది, కానీ కార్పొరేషన్ కార్యాలయంలో ఉచితంగా వ్యాక్సిన్ వేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 90 శాతం వరకు కుక్కలకు వ్యాక్సిన్ పూర్తి చేశామన్నారు. వాక్సిన్ వేసిన డాగ్‌కు మార్కింగ్ చేస్తున్నామన్నారు. బ్లూ క్రాస్ షెల్టర్ డైరెక్టర్ కుమారి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి, స్థానిక నాయకులు కృష్ణారెడ్డి, వాలంటరీస్ సురభిసింగ్, కార్యాలయ సిబ్బంది, వివిధ కాలనీల కుక్కల యజమానులు పాల్గొన్నారు.

పండగ పూటా పస్తులేనా..?

- రెండు నెలలుగా పంచాయతీ కార్మికులకు అందని జీతాలు
- అప్పులు చేసి జీవనం సాగిస్తున్నామంటూ ఆవేదన



శంషాబాద్ మండలం జూకల్ పంచాయతీ కార్యాలయ భవనం

శంషాబాద్ రూరల్: పంచాయతీ కార్మికులకు రెండు నెలల నుంచి జీతాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. రానున్న దసరా రోజు పండగకు పస్తులేనా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 21 పంచాయతీల్లో సుమారు వంద మంది పంచాయతీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా వీధులు, మురుగుకాలువలను శుభ్రం చేయడం, చెత్త సేకరణతో పాటు , నీటి సరఫరా, వీధి దీపాల మరమ్మతులు, ఆస్తి పన్నుల వసూళ్ల వంటి పనులు చేస్తున్నారు. కారోబార్, స్వీపర్లు, వాటర్‌మెన్, ఎలక్ట్రీషియన్, కామాటి, ట్రాక్టర్ డ్రైవర్లుగా సిబ్బంది పని చేస్తున్నారు.

నిధులు రాక..

పంచాయతీలకు స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నుంచి నిధులు మంజూరవుతుంటాయి. ఈ నిధులతో సిబ్బంది జీతాలు, పంచాయతీల నిర్వహణ చేస్తుంటారు. నెల నెలా ఆయా పనులకు బిల్లులు, జీతాల కోసం స్పెషల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శి సమర్పిస్తే.. వాటి తాలుకు డబ్బులు సిబ్బంది ఖాతాల్లో జమ అవుతాయి. టీఎస్‌బీపాస్ ద్వారా నిధుల పంపిణీ జరుగుతుంది. అయితే రెండు నెలలుగా నిధులు రాకపోవడంతో.. జూలై, ఆగస్టు నెలల జీతాలు ఇవ్వలేదు. ఒక్కో సిబ్బందికి నెలకు రూ.9,500 చొప్పున జీతాలు చెల్లిస్తున్నారు. చిన్న పంచాయతీల్లో నలుగురు సిబ్బంది.. మేజర్ పంచాయతీల్లో 12 మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు.

కేంద్రం నిధులు బంద్..

పంచాయతీ పాలకవర్గం కాలం గత ఏడాది ఫిబ్రవరిలో ముగిసింది. ఆ తర్వాత ఆరు నెలల వరకు కేంద్రం నుంచి పంచాయతీలకు నిధులు వచ్చాయి. జనాభా ప్రాతిపదికన ఆయా పంచాయతీలకు ప్రతి మూడు నెలలకు ఒకసారి 60 వేల రూ. 7 లక్షల వరకు నిధులు జమ అయ్యేది. తర్వాత నిధులు బంద్ కావడంతో పంచాయతీల నిర్వహణ భారంగా మారింది. ఈ నిధులతో సిబ్బంది జీతాలు, అభివృద్ధి పనులు చేపట్టేవారు. ఇటు కేంద్రం నిధులు బంద్.. అటు రాష్ట్ర నిధులు రాక జాప్యంతో పంచాయతీల్లో నిధులకు కటకట ఏర్పడుతోంది.

సిబ్బందికి తప్పని ఇబ్బందులు..

పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సమయానికి జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో సిబ్బంది కొన్ని చోట్ల ఖాళీ సమయాల్లో వ్యవసాయ కూలీ పనులకు వెళ్లేవారు. కాని ప్రస్తుతం పని భారంతో పూర్తి సమయం విధులకు కేటాయిస్తున్నారు. దీంతో జీతాలు రాక.. అదనపు ఆదాయం లేక అప్పులు చేసి జీవనం సాగిస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శులపై భారం..

సిబ్బందికి సమయానికి జీతాల రాక పోవడంతో పరోక్షంగా పంచాయతీ కార్యదర్శులపై ఆర్థిక భారం పడుతోంది. సిబ్బందికి డబ్బులు సమకూర్చి వారి చేత పనులు చేయించుకోవాల్సి వస్తుంది. తప్పని పరిస్థితుల్లో సొంత డబ్బులు ఇచ్చి పనులు చేయిస్తున్నారు. పెద్దషాపూర్‌లో రెండు నెలల కిందట.. సిబ్బంది జీతాలు రాకపోవడంతో కొన్ని రోజులు విధుల బహిష్కరించారు. ట్రాక్టర్ డీజిల్, మరమ్మతుల పనులు, బోనాలకు వీధి దీపాలు ఏర్పాటు.. తదితర బిల్లులను కార్యదర్శులు జేబుల నుంచి భరించాల్సి వస్తుంది. కొన్ని చోట్ల బోరు మోటార్ల నిర్వహణ కూడా భారంగా మారుతోంది. మండలంలో గత కొన్ని రోజులు మిషన్ భగీరథ నీటి సరఫరా కావడంలేదు. పైపులైన్ మరమ్మతుల కారణంగా నీటి సరఫరా లేకపోవడంతో.. గ్రామాల్లో బోరు మోటార్ల నుంచి నీటి సరఫరా చేస్తున్నారు. కొన్ని చోట్ల ట్యాంకర్ల నుంచి నీళ్లు పంపిస్తున్నారు. ఇందుకోసం అయ్యే వ్యయాన్ని ప్రస్తుతానికి పంచాయతీ కార్యదర్శులు భరించాల్సి వస్తుంది. తాగు నీటి పైపుల లీకేజీ, డ్రైనేజీ లీకేజీల మరమ్మతుల కోసం తప్పనిసరిగా ఖర్చు చేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.